


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 362 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 1 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :362 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 1 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

- విశాఖ జిల్లాలో నారా లోకేశ్ పర్యటన
- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం



పెన్ పవర్ డెస్క్:"ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

- మిగతా 2లో



## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం
- పారిశుధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన
- ప్రభుత్వ శాఖల సేవలు, ధ్రువపత్రాల జారీ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలని నిర్దేశం
- వెలిగొండ తరహాలో ప్రతి కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం పెంచాలని పిలుపు
- నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని

- మిగతా 2లో



# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

- వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- పంచెకట్టులో కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు, హారతి.. సాష్టాంగ నమస్కారం
- రాబోయే తరాల కోసం పనిచేస్తా, ఓట్ల కోసం కాదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి
- ఇక మార్కాపురం టైం మొదలైందని, ఈ ప్రాంతం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య
- ఉద్యమకారుడు పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులను సత్కరించిన చంద్రబాబు

వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు."మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.. ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను. ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను.

- మిగతా 2లో








## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

పెన్ పవర్ డెస్క్: రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక

- మిగతా 2లో

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

- మిగతా 2లో





## సింధు జలాలపై తీర్పు.. కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్

- సింధు జలాల ఒప్పందంపై హేగ్ కోర్టు తీర్పును తిరస్కరించిన భారత్
- ఆ కోర్టుకు తమపై ఎలాంటి అధికారం లేదని స్పష్టం
- కోర్టు ఏర్పాటు చట్టవిరుద్ధమని పేర్కొన్న విదేశాంగ శాఖ
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- తీర్పుతో తమ ప్రాజెక్టులపై ప్రభావం ఉండదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్: సింధు జలాల ఒప్పందంపై ప్రపంచబ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును భారత్ తోసిపుచ్చింది. ఈ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైనదిగా పేర్కొంది. సింధు జలాల ఒప్పందం తాత్కాలిక నిలుపుదల కొనసాగుతుందని స్పష్టంచేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ

- మిగతా 2లో

## యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

- యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- 11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం NDRF, SDRF బృందాల సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా
- ఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో

- మిగతా 2లో



## రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

### కూనంనేని సంచలన వ్యాఖ్యలు

- మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్న కూనంనేని
- స్వేచ్ఛ లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరిక
- సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదని కొండా సుస్మితకు సూచన
- రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలన్న కూనంనేని
- కోటి ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని వెల్లడి

- మిగతా 2లో



## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

- 2029లో విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే ప్రచారం
- దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం
- మా పీఎం అభ్యర్థి రాహుల్ గాంధీనేనని స్పష్టం చేసిన కాంగ్రెస్

- మిగతా 2లో



## ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ..

### యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు

- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో మోదీ భేటీ
- యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి సమావేశం
- హర్మూజ్ జలసంధిపై చర్చ జరిగి ఉండొచ్చని అంచనా
- ఇరాన్ యుద్ధం కోరుకోవడం లేదన్న పెజెష్కియాన్
- అర్మేనియా ప్రధాని పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ

- మిగతా 2లో

కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## ఎడిటర్ వ్యూ

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

### సేవే పరమావధిగా సాగిన జీవితం

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

### విలువలతో కూడిన విద్యే లక్ష్యం

"విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

### విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

### అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిస్కించన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

చెలరేగిన మంటలు వరుస పేలుళ్లకు దారితీయడంతో 11 మంది సజీవ దహనం అయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనౌరి బజార్‌లో జరిగిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ శర్మ కథనం ప్రకారం, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (చీణ=ఖీ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ూణ=ఖీ) బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ధ్రువీకరించారు. గాయపడిన ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూప్ రాణి నెహ్రూ (ూ=చీ) ఆసుపత్రికి తరలించారు. పేలుళ్ల తీవ్రతకు ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలోని కొన్ని నిర్మాణాలు కూడా కుప్పకూలాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేజిస్ట్రేట్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ప్రమాద స్థలంలో బంధువులు తమ వారి కోసం శిథిలాల మధ్య వెతుకుతున్న దృశ్యాలు, ఆసుపత్రుల వద్ద ఆత్మీయుల సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడి పరిస్థితికి అద్దం పట్టాయి.

# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర: సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలను చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు.

ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. 2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడింది. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి చెల్లింపులతో మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశామని డ్రామాలాడారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలి? ప్రధాని మోదీ సాయం.. మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర ఇది. 2024 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్, నేనూ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చాం. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి అన్నీ ప్రయోజనాలే.

### నీటి సమస్యకు పరిష్కారం.. నదుల అనుసంధానం..

చేతగాకపోతే తప్పు లేదు.. చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా.. ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి. నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం.. నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే.. ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా చేసుకోబోతున్నాం. గోదావరి నీళ్లు కూడా నల్లమలసాగర్‌కు రావాలి. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే సంపద సృష్టించొచ్చు. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. ఎల్లుండే పోలవరం ఎడమకాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ప్రతి నీటిబొట్టును భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం జరిగితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

నల్లమలసాగర్ నుంచి ప్రతిఇంటికి కుళాయి ద్వారా నీరిస్తాం. రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్‌లో మార్కాపురాన్ని భాగం చేశాం. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుంది. వెలిగొండ తొలి దశతో ఆగము.. ఫేజ్ 2 కూడా 2028 నాటికి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలి. నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు.. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తా. నెక్ట్స్ ఎన్నికల కోసం కాదు.. నెక్ట్స్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంత వరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేదాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు.

ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

# రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో

పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

తమిళనాడులో అధికార టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ, ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రస్తావిస్తుండడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షమైన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకవేళ ఇదే ప్రచారం కొనసాగితే మంత్రివర్గం నుంచి వైదొలిగేందుకైనా వెనుకాడబోమని కాంగ్రెస్ హెచ్చరించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇటీవల తిరుప్పూర్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో టీవీకే సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఏ. సెంగొట్టయన్ మాట్లాడుతూ, విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన స్థాయి ఎంజీఆర్, జయలలితలను మించి ఉంటుందని ప్రశంసించారు. అంతేకాకుండా, టీవీకే అంతర్గతంగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తర్వాత విజయ్ మూడో స్థానంలో ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ పార్టీ సీనియర్ నేత మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి టీవీకే మద్దతు తెలపని పక్షంలో తమిళనాడు మంత్రివర్గం నుంచి కాంగ్రెస్ వైదొలిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, డీఎంకే నేత భారతి ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "ఊహలకు హద్దులుండవు, రేపు విజయ్ ఏకంగా ఐక్యరాజ్యసమితి చీఫ్ అవుతారని కూడా అంటారేమో" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మరో మిత్రపక్షమైన ఎండీఎంకే సైతం ఈ వాదనను వ్యతిరేకించింది. ఇండియా కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే ప్రధానమంత్రి అభ్యర్థి అని, టీవీకే నేతలు ఇటువంటి ప్రచారాలను కట్టిపెట్టాలని సూచించింది. వెరసి, '2029లో విజయ్ ప్రధాని' అనే నినాదం తమిళనాడు అధికార కూటమిలో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా, మిత్రపక్షాల మధ్య పొడచూపిన విభేదాలను బహిర్గతం చేస్తోంది.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

- మొదటి పేజి తరువాయి

తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను

ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో 'అవేర్' (ూౌూ=జు) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింధు జలాలపై తీర్పు..

## కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్

- మొదటి పేజి తరువాయి

బ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడానికి న్యూఢిల్లీ చెప్పిన కారణం సహేతుకంగా, రద్దుకు సమర్థనీయంగా లేదని పేర్కొంది. జలాల ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించింది. అలాగే, జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న హైడ్రోఎలక్ట్రిక్ పనులపై పరిమితులు విధించింది. దీనిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించింది. ఈ మధ్యవర్తిత్వ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైందని, భారత్ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అర్హత గానీ, అధికార పరిధి గానీ దానికి లేదని స్పష్టంచేసింది. ఈ కోర్టును మొదటి నుంచీ భారత్ గుర్తించలేదని, దాని విచారణలకు ఎప్పుడూ హాజరుకాలేదని తెలిపింది. కాబట్టి ఆ న్యాయస్థానం ఇచ్చే తీర్పులు ఏవీ చెల్లవని, భారత్ చేపట్టే ప్రాజెక్టులపై వాటి ప్రభావం ఉండదని తేల్చిచెప్పింది.

### ఏమిటీ ఒప్పందం?

సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తోందనే కారణంతో 2025 ఏప్రిల్‌లో భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అణచివేసే వరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ ఉండదని భారత్ స్పష్టం చేసింది.

# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ..

## యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు

- మొదటి పేజి తరువాయి

ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి.

ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- మొదటి పేజి తరువాయి

పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# పెండింగ్ ప్రత్యేక ఓటర్ల సవరణ విచారణలను వేగవంతం చేయాలి

## రెండు రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తి చేయాలి: కలెక్టర్ నిశాంతి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 31:**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న విచారణలు, నోటీసుల జారీ ప్రక్రియను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు. సోమవారం పాడేరు కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పాడేరు శాసనసభ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న విచారణలను పూర్తి చేసి, అవసరమైన నోటీసులను ఎటువంటి జాప్యం లేకుండా జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేసును నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.అరకు శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో పెండింగ్‌లో ఉన్న విచారణలు, నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అధిక సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్న అరకు మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ విచారణలు, నోటీసుల జారీ ప్రక్రియను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని, నిర్ణీత గడువును పాటించడంలో విఫలమైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పెండింగ్ కేసులకు సంబంధించిన అవసరమైన దస్త్రాలు, రికార్డులను సంబంధిత అధికారులు సమర్పించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసులకు సంబంధించిన అన్ని దస్త్రాలు, రికార్డులను వెంటనే సమర్పించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విచారణలు, నోటీసుల జారీ ప్రక్రియపై సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేసి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా రెవెన్యూ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం 2026 జూలై 1ను అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించగా, అభ్యర్థనలు, అభ్యంతరాల దాఖలుకు ఆగస్టు 30 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. నోటీసుల జారీ, అభ్యర్థనలు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుందని, తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 3న ప్రచురించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అభ్యర్థనలు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, పాడేరు శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, గిరిజన ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, అరకు శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, పాడేరు ఆర్డీవో ఎం.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 3,303 పీఎం-జన్మన్ ఇళ్లను త్వరగా ప్రారంభించాలి



పెండింగ్ ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ నిశాంతి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 31:**

ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్మన్) పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో పథకం కింద ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పీఎం-జన్మన్ పథకం కింద 28,691 ఇళ్లు మంజూరు కాగా, 25,388 ఇళ్లు నిర్మాణ దశలోకి వెళ్లాయని, మరో 3,303 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణ ప్రారంభం 88 శాతంగా ఉండగా, పూర్తయిన ఇళ్లు 24 శాతంగా ఉన్నట్లు తెలిపారు.నిర్మాణం ప్రారంభం కాని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది వ్యక్తిగతంగా పరిశీలించి, నిర్మాణం ఎందుకు ప్రారంభం కాలేదో గుర్తించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి అవసరమైన సహకారం అందిస్తూ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.లబ్ధిదారులకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అందేలా చూడాలని, నిర్మాణ సామగ్రి సమకూర్చడం, భూమిపూజ, ఇతర ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి పెండింగ్ ఇంటి బాధ్యతను సంబంధిత అధికారి లేదా సిబ్బందికి అప్పగించి, నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పథకం కింద అర్హత లేని లబ్ధిదారుల విషయంలో పూర్తిస్థాయి పరిశీలన నిర్వహించి, సరైన ఆధారాలతో మాత్రమే తగిన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం లబ్ధిదారు నిర్మాణంపై ఆసక్తి చూపకపోవడం లేదా వలస వెళ్లడం మాత్రమే ఇంటిని రద్దు చేయడానికి కారణంగా పరిగణించరాదని తెలిపారు.పీఎం-జన్మన్ పథకం ద్వారా ప్రత్యేకంగా బలహీన గిరిజన తెగల కుటుంబాలకు సురక్షితమైన గృహ వసతి కల్పించడమే లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్.లోకేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ విలువలకు మానవ రూపం రోశయ్య

## 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా విగ్రహం నిలవాలి: మంత్రి నారా లోకేష్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31 :**సిరిపురం సర్కిల్: రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ.. రోశయ్య రాజకీయ జీవితాన్ని నేటి తరానికి, భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోశయ్య విగ్రహాన్ని 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా పిలవాలని ప్రతిపాదించారు.

### రాజకీయ విభేదాలున్నా వ్యక్తిగత గౌరవం

రాజకీయ విలువల గురించి మాట్లాడినప్పుడు గుర్తుకొచ్చే గొప్ప నాయకుల్లో రోశయ్య ఒకరని లోకేష్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిజాయతీ, విషయ పరిజ్ఞానం, మాటల్లో మంచితనం, విమర్శల్లో పదును ఆయన ప్రత్యేకతలని అన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవ మాత్రమే శాశ్వతమని రోశయ్య నమ్మేవారని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారానికి దూరంగా, ప్రతిప క్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఆయన వ్యవహరించేవారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీలో రోశయ్య మాట్లాడుతుంటే అందరూ శ్రద్ధగా వినేవారని, ప్రభుత్వం--ప్రతిపక్షాల మధ్య ఆయన వారధిగా వ్యవహరించేవారని అన్నారు.చంద్రబాబు, వైఎస్సార్ మధ్య వాడివేడిగా వాదనలు జరిగిన సందర్భాల్లో రోశయ్య జోక్యం చేసుకుని పరిస్థితిని చల్లబరిచేవారని లోకేష్ గుర్తుచేశారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని కాపా డిన నాయకుడు రోశయ్య అని కొనియాడారు.

### సాధారణ కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి

పల్లెటూరిలో సాధారణ కుటుంబంలో జన్మించిన రోశయ్యకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని లోకేష్ అన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన పల్లెటూరు నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన గొప్ప నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రులు మారినా అనేక కేబినెట్లలో రోశయ్య కొనసాగారని, పార్టీకి మొదటి నుంచి చివరి వరకు నిబద్ధతతో పనిచేశారని తెలిపారు. ఆస్తులు, రాజకీయ వారసత్వం లేకపోయినా కష్టం, క్రమశిక్షణ, విలువలు ఉంటే రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని రోశయ్య నిరూ పించారని అన్నారు.రోశయ్య ఒక రాజకీయ పాఠశాల వంటివారని, నేటి తరానికి ఆయన స్ఫూర్తిగా నిలుస్తారని లోకేష్ పేర్కొన్నారు.

### మ్యూజియం ఏర్పాటు చేయాలి

గొప్ప వ్యక్తులకు విగ్రహాలు ఏర్పాటు చేయడం వారికి ఇచ్చే ఘన నివాళి అని లోకేష్ అన్నారు. అయితే విగ్రహాల ఏర్పాటుతోనే బాధ్యత ముగియకూడదని, వారి జీవిత చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంద న్నారు.రోశయ్య జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, విజయాలు యువతకు తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయన జీవిత చరిత్రపై పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించి యువతకు చేరువ చేయాలని సూచించారు.రోశయ్య జీవిత చరిత్రను తెలియజేసేలా మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య పెద్దలకు సూచించారు. మ్యూజియం కోసం స్థలం ఏర్పాటు చేస్తే కేవలం 18 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దేశానికి అంకితం చేసేలా కృషి చేస్తామని చెప్పారు.

### పాఠ్యాంశాల్లో రోశయ్య జీవితం

బాల్యం నుంచే రోశయ్య జీవిత చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉందని లోకేష్ అన్నారు. ఇందుకోసం పాఠ్యాంశాల్లో రోశయ్య జీవిత చరిత్రపై ఒక అధ్యాయం చేర్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు.

అదేవిధంగా రోశయ్య అవలంబించిన రాజకీయ విలువలపై టీడీపీ క్యాడర్ శిక్షణ కార్యక్రమాల్లో ఒక అధ్యాయం చేర్చే బాధ్యత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుదని తెలిపారు. ప్రభుత్వం, ఆర్యవైశ్య పెద్దలు కలిసి రోశయ్య సేవలను భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, ఇంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని లోకేష్ అన్నారు.

### కుటుంబ సభ్యులతో లోకేష్ భేటీ

విగ్రహావిష్కరణకు ముందు రోశయ్య కుటుంబ సభ్యులు పైడా కృష్ణ ప్రసాద్, పైడా రమాదేవి, పైడా మౌర్య, కొణిజేటి శివసుబ్బారావు, కేఎస్ఎన్ మూర్తితో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సమాజ శ్రేయస్సు కోసం రోశయ్య చేసిన సేవలు, త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో అన్నారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, ఎంపీ మతుకుమిల్లి భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్ ) నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి..

## టెట్ మినహాయింపు అంశంపై రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం ప్రవేశ పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి.

## డి టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. గురుదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. దేముడు.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 31.**

ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్ ) నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ( డిటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎస్. గురుదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. దేముడు డిమాండ్ చేశారు. డిటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మండల కేంద్రంలోని పాత తాలూకా ప్రధాన కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23 (1) ను సవరించి ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు తట్టు నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా విద్యాబోధనలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు తిరిగి ఇప్పుడు టెట్ పరీక్ష రాయాలని ఒత్తిడి చేయడం వల్ల వారిలో అనేకమంది ఆందోళనకు గురవుతున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల సర్వీసు, ఉద్యోగ భద్రత పదోన్నతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తట్టి పై మినహాయింపు అంశం పై రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రత్యేక టెట్టులో ఉత్తీర్ణత మార్కులను 40 శాతానికి పరిమితం చేయాలని ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్కే పరీక్షను పరిమితం చేయాలని కోరారు. తట్టు పరీక్షలు నిర్వహించడానికి ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల తమిళనాడు శాసనసభలో 2010 ఆగస్టు 23 కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు తట్టు నుంచి పూర్తి శాశ్వత మినహాయింపు కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం ఆమోదించిన విషయాన్ని డిటిఎఫ్ నాయకులు ప్రస్తావించారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని వారి కోరారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో 2011 కు ముందు నియమితులైన కొందరు ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమితను ఇచ్చిన నేపథ్యంలో మినహాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిటిఎఫ్ నాయకులు కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హతకు సంబంధించిన నిబంధనల అమల్లోకి వచ్చినప్పటికీ, దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల సమస్యను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించారని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ సంఘ నాయకులు వీరయ్య దొర, పెద్ద బాలరాజు, శ్యాంసుందర్, వీరబాబు తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రోశయ్య సేవలు చిరస్మరణీయం

- విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్ గణబాబు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31 :**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య రాజకీయాల్లో ఎంతో హుందాతనం కలిగిన నేతగా గుర్తింపు పొందారని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు అన్నారు.సిరిపురం ఆల్ ఇండియా రేడియో జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం గణబాబు మాట్లాడుతూ.. రోశయ్య రాజకీయ జీవితంలో విలువలు, హుందాతనానికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. ప్రజాసేవలో రోశయ్య చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు.

# డ్రైనేజీ నిర్మించాలని పీజీఆర్ఎస్‌లో వినతి




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 31:**దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్డికొండ-2 గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. సోమవారం దామనాపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కట్టుపల్లి సెగ్మెంట్ పీసా కార్యదర్శి మాదిరి చంటిబాబు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు సక్రమంగా వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామసభల్లో పలుమార్లు డ్రైనేజీ నిర్మాణం అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి దొడ్డికొండ-2 గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మాదిరి చంటిబాబు కోరారు.

# ఉపాధి హామీ సిల్వర్ ఓక్ మొక్కల పంపిణీలో అక్రమ వసూళ్లపై విచారణ జరిపిన అధికారులు.

- లబ్ధిదారులకు అక్రమంగా వసూలు చేసిన నగదు తిరిగి అందజేత.
- ఇకపై అక్రమ వసూళ్లకు తెగబడితే కఠిన చర్యలు తప్పవు.
- ఏపీడి ఆర్. వెంకట్రావు, ఏపీవో సిహెచ్. రాంప్రసాద్.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 31.**ఉపాధి హామీ పథకం కింద మొక్కల పంపిణీకి సంబంధించి లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టారు. అల్లూరి సీతారామరాజు, జిల్లా చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని చెరపల్లి గ్రామంలో దీనిపై విచారణను నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమ వసూళ్లపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏపీడీ. ఆర్ వెంకటరావు, ఏపీవో జ ఎ రాంప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచారణలో లబ్ధిదారుల నుంచి నగదు తీసుకున్న విషయం వాస్తవమేనని నిర్ధారణ కావడంతో, వసూలు చేసిన నగదును సంబంధిత లబ్ధిదారులకు పెద్దలు, మరియు గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, నిరుద్యోగుల సంఘం కో కన్వీనర్ డి కుర్మారావు (రాజు), పిసా కమిటీ సెక్రటరీ ప్రసాద్, వార్డ్ మెంబర్ బి. వెంకట్, గ్రామ పెద్దలు డి రాంబాబు, నూకరాజు తదితరుల సమక్షంలో అక్రమంగా వసూలు చేసిన నగదును తిరిగి లబ్ధిదారులకు అందజేశారు.

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు, మొక్కల పంపిణీ తదితర కార్యక్రమాల్లో లబ్ధిదారుల నుంచి ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ కే. విశ్వనాథం, కే.రఘుపతి, ఎస్ మహేష్, మురళి,ఉపాధి కూలీలు పాల్గొన్నారు

# దివ్యాంగుల స్వయం సమృద్ధికి ప్రభుత్వం అండ

**51 మంది దివ్యాంగులకు ఉచిత మోటార్ స్కూటీల పంపిణీ**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31 :** దివ్యాంగులు స్వతంత్రంగా జీవిస్తూ స్వయం సమృద్ధి సాధిం చేలా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివా స్ అన్నారు. దివ్యాంగుల స్వతంత్ర జీవనానికి తోడ్పడే ఉచిత త్రిచక్ర మోటార్ వాహనాలను సోమవారం విశాఖ కలెక్టరేట్ ప్రాంగణంలో 51 మంది అర్హులైన దివ్యాంగులకు పంపిణీ చేశారు.ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ దివ్యాంగుల స్వయం సమృద్ధికి కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమ న్నారు. ఒక్కో మోటార్ వాహనం విలువ సుమారు రూ.1.02 లక్షలు ఉంటుందని తెలిపారు. విశాఖ జిల్లాలోని ఆరు అసెం బ్లీ నియోజకవర్గాలకు 60 వాహనాలు మంజూరు కాగా, ప్రస్తుతం 51 మంది అర్హులకు అందజేస్తున్నట్లు వివరించారు. అర్హత ఉన్న దివ్యాంగులు ఇంకా ఎవరైనా ఉంటే విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారులను లేదా స్థానిక ఎమ్మెల్యే లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మా ట్లాడుతూ అర్హత ఉన్న దివ్యాంగులు ఎవరైనా మిగిలి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి కూడా త్రిచక్ర మోటార్ వాహ నాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని దివ్యాంగులు ఆత్మనిర్భరత సాధించాలని ఆకాంక్షించారు.

విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. నియోజకవర్గానికి 10 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1,750 మోటార్ స్కూటీలను దివ్యాంగులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, టిడ్కో గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇళ్ల కేటాయింపు, సుమారు 370 బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టిందని వివరించారు.విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత మాట్లాడుతూ 100 శాతం సబ్సిడీతో త్రిచక్ర మోటార్ వాహనాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి విశాఖ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 60 వాహనాలు మంజూరు కాగా, మొత్తం 79 దరఖాస్తులు అందాయని చెప్పారు. వాటిలో అర్హత కలిగిన 51 మందిని జిల్లా ఎంపిక కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు.

# స్థానిక సంస్థాగత ఎన్నికలకు మండల స్టీరింగ్ కమిటీ ఏర్పాటు.

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షులు పాంగి ఘన బాబు.**



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 31.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో చింతపల్లి మండలానికి సంబంధించి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చింతపల్లి పార్టీ మండల అధ్యక్షులు పాంగి ఘనబాబు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఈ స్టీరింగ్ కమిటీని వేయడం జరిగిందన్నారు. చింతపల్లి కి సంబంధించి 17 పంచాయితీలలో 20 ఎంపీటీసీ సెగ్మెంట్లకు అభ్యర్థుల పరిశీలన జరుగుతుందని అభ్యర్థుల పేర్లను పరిశీలించి జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రాజుకు పంపించడం జరుగుతుందని అన్నారు. తుది నిర్ణయాన్ని జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రాజు తీసుకుంటారన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా తనతో పాటు ఎస్ టి విభాగం రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, జడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సాగిన గంగన్న పడాల్, మాజీ మండల అధ్యక్షులు మోరు రవి ఉంటారన్నారు. ఆయా పంచాయతీలలో సమావేశాలు ఎప్పుడు పెడుతున్నామనేది త్వరలో ఖరారు చేస్తామని ఆయన వివరించారు.

# నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమం




**గాజువాక,:పెన్ పవర్ ,ఆగస్టు 31:** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సుందరపల్లి శ్రీనివాస్, డాక్టర్ బదరీ నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ. నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని తెలిపారు. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని వివరించారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.అనంతరం గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించి, నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి, మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రజలను ప్రోత్సహించాలని సిబ్బంది పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నేత్ర వైద్య అధికారి సరళ ధనలక్ష్మి, బహుళ ప్రయోజన ఆరోగ్య విస్తరణ అధికారి సీ.హెచ్.ఎస్.ఈ. అచ్చుతారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు గండేపల్లి రాము, ఆరోగ్య సందర్శకురాలు ఎస్. రత్నాలు, సహాయక నర్సు మిడ్‌వైఫరీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిరిగిన బట్టలైనా వేసుకో..




- మంచి పుస్తకాన్ని మాత్రం కొనుక్కో.
- విజ్ఞానాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాలకి ప్రత్యేక పాత్ర.
- అల్లూరి సీతారామరాజు జిల్లా గిరి బాల నేస్తం జిల్లా కన్వీనర్ వి. వి. జయ.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 31.** చిరిగిన బట్టలైనా వేసుకోవాలి గాని ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కోవడం లో ముందు ఉండాలని, గ్రంథాలయాలు జ్ఞాన సమర్థులకు నిలయాలు వంటివని అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిబాల నేస్తం జిల్లా కన్వీనర్ వి.వి. జయ అన్నారు. చింతపల్లి మండలం, చౌడుపల్లి గ్రామంలో ఉద్యోగులు గ్రామస్తులు దాతలు సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పుస్తకం వారి సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి 200 పుస్తకాలను ఇవ్వడం జరిగిందన్నారు. చిన్నప్పటినుంచి పిల్లలు చదువు పట్ల ఆసక్తి పెంచడానికి గ్రంథాలయాలు చాలా ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు, న్యూస్ పేపర్స్ అందుబాటులో ఉండి చదివే వాళ్లకు ఏ విషయంపై ఆసక్తి ఉంటే ఆ పుస్తకాలను చదవడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. పిల్లలకు చదువు ఆటలు సాంస్కృతిక కళారూపాలు కథలు చదవడం రాయడం వంటి వాటిల్లో చిన్నప్పటినుంచి అన్నిట్లో ఆసక్తి పెంచాలని అన్నారు. గ్రంథాలయాల్లో ఐక్యంగా చదువుకోవడం, పోటీ పరీక్షలకు గ్రూపులుగా చర్చించుకోవడం కొత్త విషయాలు నేర్చుకోవడం వ్యక్తిగత అభివృద్ధికి పడతాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడా తన కుటుంబాని కన్ను పుస్తకాలను ఎక్కువగా ప్రేమించే వారు అన్నారు. ప్రస్తుత రోజుల్లో పిల్లలు చదువు భయంతో హోంవర్క్ లతో సతమతమవుతున్నారన్నారు. ఖాళీ సమయాలలో ఫోన్లతో గడుపుతూ చెడు వ్యసనాలకు గురవుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో గ్రామ గ్రామాన గ్రంథాలయాలు ఏర్పాటు జరగాలని దీనికి ప్రభుత్వం కూడా బాధ్యతగా తీసుకొని ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా నాయకులు బోనంగి పుష్ప, గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలపై స్పష్టత.. తుది జాబితా ప్రచురణ

- పంచాయతీ పోలింగ్ కేంద్రాల ఫైనల్ పబ్లికేషన్ పూర్తి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 31:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రామ పంచాయతీ ఓటర్ల పోలింగ్ కేంద్రాల తుది జాబితా (ఫైనల్ పబ్లికేషన్) సోమవారం ప్రచురించినట్లు ఎంపీడీవో బిహెచ్‌వి రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సంబంధిత గ్రామ సచివాలయాల్లో పంచాయతీ ఓటర్ల పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన తుది ప్రచురణ ప్రక్రియను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తుది జాబితాను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

# మారికవలస గురుకుల విద్యార్థుల ఆందోళనకు ఎమ్మెల్యే మద్దతు




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్ ఆగస్టు 31:**విశాఖపట్నం జిల్లా మారికవలసలోని గిరిజన గురుకుల విద్యా సంస్థను అక్కడే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.మారికవలస వెళ్లేందుకు సిద్ధమైన ఎమ్మెల్యేను తొలుత పాడేరులోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకుని అనుమతి లేదని తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన అక్కడి నుంచి బయలుదేరగా పాడేరు సమీపంలోని వంతడపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మరోసారి నిలిపివేసినట్లు తెలిపారు.అక్కడి నుంచి ముందుకు సాగిన ఎమ్మెల్యేను మారికవలస వెళ్లే మార్గంలో తాటిపర్తి చెక్‌పోస్ట్ వద్ద కూడా పోలీసులు అడ్డుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొనే హక్కును అడ్డుకోవడం సరికాదని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పేర్కొన్నట్లు తెలిపారు.మారికవలస గురుకుల విద్యా సంస్థను అక్కడే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# బి.హెచ్.పి.వి స్కూల్ స్వర్ణోత్సవాలు గోడ పత్రిక విడుదల

**గాజువాక:పెన్ పవర్ ,ఆగస్టు31** నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ బి.హెచ్.పి.వి ప్రస్తుతం బీహెచ్ఈఎల్ పాఠశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 3, 4 తేదీల్లో గోల్డెన్ జూబిలీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ఒక ప్రముఖ హోటల్లో ఆదివారం సమావేశమైన సీనియర్ విద్యార్థులంతా కార్యక్రమం వివరాలను వెల్లడించారు. గురు దేవో భవ పేరిట నిర్వహించనున్న ఈ స్వర్ణోత్సవ కార్యక్రమాలు బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కళ్యాణమండపంలో రెండు రోజులపాటు రోజూ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు వందనాలు అర్పిస్తూ, వారి సేవలను స్మరించుకోవడంతో పాటు భవిష్యత్తు తరాలకు ప్రేరణ అందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. బి.హెచ్.పి.వి సీనియర్ సెకండరీ స్కూల్ ఇంగ్లీష్ మీడియం, ఎయిడెడ్ హైస్కూల్ తెలుగు మీడియంలలో చదువుకున్న పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు నిర్వాహకులు జి.యన్. రాజు, శ్రీనివాస్, రాము, నారాయణ రెడ్డి, జాహ్నవి, శంకర్, ఈశ్వర్, గున్నేశ్వరావు, విజయ, భారతి, కుమారి, వరలక్ష్మి, తెలిపారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థులందరూ మళ్ళీ మన బడికి. గురువుల ఒడికి విచ్చేసి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.






## వర్షాభావం ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆసక్తి

- మినుములు, పెసర విత్తనాల పంపిణీకి చర్యలు
- మండల వ్యవసాయ అధికారి " శివరామ ప్రసాద్"



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 31:** మండలంలో వర్షాభావం ప్రభావంతో వరి నాట్లు అతి స్వల్పంగా రైతులు నాట్లు వేశారని మండల వ్యవసాయ అధికారి శివరామ ప్రసాద్ తెలిపారు. మండలంలో వరి సాగు విస్తీర్ణం 2901 హెక్టార్లు రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు అయితే జూన్ నెలలో సాధారణ వర్షపాతం 145 ఎంఎం కి గాను 99 ఎం ఎం వర్షం నమోదు కావడంతో 32 శాతం లోటు ఏర్పడిందని తెలిపారు అలాగే జులై నెలలో 264 ఎం ఎం గాను 143 ఎంఎం నమోదు కాక 46 శాతం వర్షపాతం నమోదు కావడం జరిగింది అని తెలిపారు అలాగే ఆగస్టు నెలలో 219 ఎంఎం గాను 59 ఎం ఎం మాత్రమే వర్షపాతం నమోదు అవ్వడం జరిగిందని అన్నారు. ఈ వర్షాభావం ప్రభావం నేపథ్యంలో 1200 ఎక్కార్లు లో మాత్రమే వరి నాట్లు రైతులు వేశారని అన్నారు. మిగిలిన చోట్ల ఉన్న వరి నారుమడులు ఇప్పటికే 45 నుండి 60 రోజులు పూర్తి కావడం జరిగిందని తెలిపారు. దీంతో ఈ వర్షం ప్రభావంతో నాట్లు వేయలేమని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. మిగిలిన 891 హెక్టార్లవిస్తీర్ణంలో 800 హెక్టార్ల భూముల్లో మినుము ,పెసర పంటలు పై రైతులు ఆసక్తి చూపడంతో కంటెంట్జెన్సీ ద్వారా రైతులకు రైతు కేంద్రాల విత్తనాలు సరఫరాకు నమోదు చేయడం జరిగిందని మిగిలిన వరి విస్తీర్ణం ను అపరాల సాగు చేయడానికి రైతు సేవా కేంద్రాల వారిగా గుర్తించడం జరిగిందని వ్యవసాయ అధికారి శివరాం ప్రసాద్ తెలిపారు

## విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన...!

- సైబర్ నేరాలు, మహిళల భద్రత, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు పై అవగాహన
- కొయ్యూరు సీఐ" బి శ్రీనివాసరావు"



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 31:**సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు సోషల్ మీడియాను అతి జాగ్రత్తగా వినియోగించాలని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలో మర్రిపాలెం డిగ్రీ మహిళ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ కెరీర్ గైడెన్స్ తో పాటు రోడ్డు భద్రత సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు నుండి వచ్చే ఫోన్ కాల్స్ మెసేజ్లను లింకులను నమ్మవద్దని సూచించారు. ఎవరైనా గురైతే వెంటనే 19 30 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. అలాగే మహిళలు విద్యార్థులు ఎటువంటి వేధింపులకు గురైన వెంటనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు లేదా పోలీసులను సంప్రదించాలని అత్యవసర సమయాల్లో 112 నంబర్కు సమాచారం అందించాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చెడు వ్యసనాలకు లోను కాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సాధించాలన్నారు. మత్తు పదార్థాలతో జీవితాన్ని ఆరోగ్యాన్ని చదువును భవిష్యత్తు అవకాశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ ను ఎంతో విలువైనదిగా భావించి చదువుపై పూర్తి సాధించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కెరియర్లో స్థిరపడేందుకు కష్టపడాలన్నారు. తాత్కాలిక ఆకర్షణలు ప్రేమ వ్యవహారాలు తో చదువును భవిష్యత్తును నిర్లక్ష్యం చేయొద్దని ముందుగా చదువుపై దృష్టి సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి తనలో ప్రతిభను గుర్తించి తనకు ఆసక్తి ఉన్న రంగంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## బొప్పరాజుపై భూపతిరాజు విమర్శలను ఖండిస్తున్నాం

### అనకాపల్లి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు శశిధర్



**గాజువాక:పెన్ పవర్,ఆగస్టు 31**
గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణ సంఘం, ఐదు కరువు భత్యాలు , పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి, వాటిని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. అయితే నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించినందున, రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యాచరణ సమితి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రజాస్వామ్యబద్ధంగా చేపడుతున్న ఐక్య కార్యాచరణ ఉద్యమాలను అపహాస్యం చేస్తూ విమర్శలు చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర అధ్యక్షుడు, రెవెన్యూ సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్‌గా చెప్పుకుంటున్న భూపతిరాజు రవీంద్రరాజు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అనకాపల్లి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు శశిధర్ తెలిపారు.
ఎవరి ప్రయోజనాల కోసం మీరు ఈ విధంగా వ్యవహరిస్తున్నారో భూపతిరాజు రవీంద్రరాజు స్పష్టం చేయాలని ప్రశ్నించారు. రెండున్నర సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం పాలనలో ఉద్యోగులు అనేక ఉద్యమాలు చేపట్టారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో జూలై నెల నుంచి ఉద్యమానికి వెళ్లనున్న నేపథ్యంలో ప్రభుత్వం స్వయంగా మంత్రుల బృందం, 15 మంది ప్రధాన ఐఏఎస్ అధికారులతో చర్చలకు ఆహ్వానించిందని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం భూపతిరాజుకు తెలియదా అని ప్రశ్నించారు.బొప్పరాజు వెంకటేశ్వర్లుపై చేస్తున్న వ్యాఖ్యలు ఎవరి మెప్పు కోసం చేస్తున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటికప్పుడు అసత్య విమర్శలు చేయడం, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఆయన నాయకత్వంపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ పత్రికల్లో కనిపించే ప్రయత్నం చేయడం మానుకోవాలని హితవు పలికారు.రాష్ట్ర నాయకుడిగా చెప్పుకుంటున్న మీరు ఇప్పటివరకు ఎన్ని జిల్లాల్లో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలపై సమీక్షలు నిర్వహించారని, తమ సమస్యల్లో ఏ ఒక్కటైనా పరిష్కరించారా అని ప్రశ్నించారు. మీరు చేసిన చర్యల కారణంగా ఇప్పటికే 15 వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు.ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని, నిరాధారమైన పత్రికా ప్రకటనలతో ఉద్యోగులకు అన్యాయం చేయడం మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఉద్యోగులకు వేతన సవరణ సంఘం, కరువు భత్యం, బకాయిలు అమలు చేయాలని, అన్ని తరగతుల ఉద్యోగులకు న్యాయం చేసేందుకు ముందుకు వస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లును ఆయన స్థాయిని మరచి విమర్శించడం తగదని హితవు పలికారు.రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ అధికారులపై గ్రామ, వార్డు సచివాలయ శాఖ పెత్తనాన్ని తగ్గించాలని, ఉమ్మడి డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి గా తహసీల్దార్లే కొనసాగాలని, పదోన్నతుల శాతాన్ని పెంచాలని తదితర సమస్యలపై బొప్పరాజు వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు.గ్రామ రెవెన్యూ అధికారుల నాయకులందరూ ఐక్యంగా ఉండి, గ్రామ రెవెన్యూ అధికారులకు మేలు జరిగేలా కృషి చేయాలని కోరుతూ బొప్పరాజు వెంకటేశ్వర్లు చేపడుతున్న ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు శశిధర్ తెలిపారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యాచరణ సమితి అమరావతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఐక్య కార్యాచరణ ఉద్యమాల్లో రాష్ట్రంలోని గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వినతుల కార్యక్రమం సందర్భంగా పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమం అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యాచరణ సమితి అమరావతి చైర్మన్ ఎస్.ఎస్.ఎస్.వి. నాయుడు (వాసు), ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోవరాజు ఆధ్వర్యంలో జరిగింది.
ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, చల్ల ఎరుకునాయుడు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, సింహాచలం నాయుడు, పెదబాబుతో పాటు అధిక సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ సంయుక్త కార్యాచరణ సమితి అమరావతి అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వెబ్‌లైన్ సమస్యతో రైతులు పథకాలకు దూరం.. పరిష్కరించాలని వినతి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 31:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెద్ద అగ్రవారం, చిన్న అగ్రహారం గ్రామాలకు చెందిన సుమారు 80 మంది రైతుల పట్టా భూములను సంబంధిత పంచాయతీ వెబ్‌లైన్‌లో చేర్చాలని కోరుతూ సీపీఎం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు మాట్లాడుతూ.. పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం గ్రామాలకు చెందిన రైతుల పట్టా భూములు గూడెంకొత్తవీధి పంచాయతీ వెబ్‌లైన్‌లో నమోదు కాకుండా దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని డి.అగ్రహారం గ్రామ వెబ్‌లైన్‌లో నమోదై ఉన్నాయని తెలిపారు. దీంతో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.రైతు భరోసా, అన్నదాత సుఖీభవతో పాటు ఎరువులు, విత్తనాలు తదితర వ్యవసాయ ప్రయోజనాలు అందడం లేదని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం రైతులు పాడేరు, గూడెంకొత్తవీధి మండలాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాల్లో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3 నుంచి సమస్య పరిష్కారమయ్యే వరకు గూడెంకొత్తవీధి రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టాలని రైతులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని అంపరంగి బుజ్జిబాబు ప్రకటించారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం గ్రామాలకు చెందిన రైతుల పట్టా భూములను గూడెంకొత్తవీధి పంచాయతీ వెబ్‌లైన్‌లో చేర్చి, వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్, గిరిజన సంఘం మండల నాయకుడు గెమ్మెల పరమేశ్వరరావు, పీసా కమిటీ సభ్యుడు కొర్ర రాంబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు టీడీపీ సన్నద్ధం.. సెప్టెంబర్ 3న డోర్ టు డోర్ కార్యక్రమం

### స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 1:**
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం గూడెంకొత్తవీధి మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పి.కొండలరావు తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఆయా పంచాయతీల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకోనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి పాడేరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.వి. ప్రసాద్, రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ కె.వెంకటరమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావుతో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, బూత్ యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పి.కొండలరావు కోరారు.

## గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్ ల తుది జాబితా ప్రచురణ

- పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసిన ఎంపీడీవో, ఎస్సై, రెవిన్యూ అధికారి.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 31.**గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్ ల తుది జాబితాను మండలంలోని 23 గ్రామ పంచాయితీలలో ప్రచురించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాబోయే ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను స్థానిక ఎస్సై పీ నాని, రెవిన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు తనిఖీ చేసి పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. గ్రామపంచాయతీ పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో కూడా ప్రదర్శించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

## వైస్ ఎంపీపీ" అప్పన వెంకటరమణ డిమాండ్"



కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 31 : కరువుతో అల్లాడుతున్న అల్లూరి జిల్లా ను కరువు ప్రాంతంగా ప్రకటించాలని వైసీపీ పార్టీ వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కొయ్యూరు మండలంలో ఎల్ నీ వో వర్ష బావ ప్రభావంతో నేటికి వరి నాట్లు వేసిన దాఖలాలు లేవని మండలంలో గిరిజన మైదాన ప్రాంత వ్యవసాయ రైతులు ఏడువేల ఎకరాలు వరి సాగు చేస్తారని అలాంటిది ఇప్పటివరకు మూడు వేల ఎకరాలలో మాత్రమే వేసినా నేటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వాటిని పశువులు మేత మీసేందుకు వదిలేస్తున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పెరిగిన నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు నిత్యవసర సరుకులు కొనుక్కునే రీతిలో లేరని, రైతు ఎన్నో అప్పులు చేసి వ్యవసాయం చేయడానికి ముందుకొస్తుంటే కాలం అనుకూలించక నష్టపోతున్నారని ఆయన అన్నారు. కావున అల్లూరు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి ముఖ్యంగా మండలంలో రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. దీనిపక్షంలో వేలాది మంది రైతులతో మండల కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు

## ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్ ) నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి..

- టెట్ మినహాయింపు అంశంపై రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం ప్రవేశ పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి.
- డి టి ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. గురుదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. దేముడు.



చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 31.

ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్ ) నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ( డిటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఎస్. గురుదొర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. దేముడు డిమాండ్ చేశారు. డిటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మండల కేంద్రంలోని పాత తాలూకా ప్రధాన కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23 (1) నువ్వు సవరించి ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా విద్యాబోధనలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు తిరిగి ఇప్పుడు టెట్ పరీక్ష రాయాలని ఒత్తిడి చేయడం వల్ల వారిలో అనేకమంది ఆందోళనకు గురవుతున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల సర్వీసు, ఉద్యోగ భద్రత పదోన్నతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. టెట్ పై మినహాయింపు అంశం పై రాష్ట్ర శాసనసభలో ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రత్యేక టెట్ లో ఉత్తీర్ణత మార్కులను 40 శాతానికి పరిమితం చేయాలని ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్కే పరీక్షను పరిమితం చేయాలని కోరారు. టెట్ పరీక్షలు నిర్వహించడానికి ఆన్లైన్లో కాకుండా ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల తమిళనాడు శాసనసభలో 2010 ఆగస్టు 23 కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి పూర్తి శాశ్వత మినహాయింపు కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం ఆమోదించిన విషయాన్ని డిటిఎఫ్ నాయకులు ప్రస్తావించారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని వారు కోరారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో 2011 కు ముందు నియమితులైన కొందరు ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతను ఇచ్చిన నేపథ్యంలో మినహాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిటిఎఫ్ నాయకులు కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హతకు సంబంధించిన నిబంధనల అమల్లోకి వచ్చినప్పటికీ, దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల సమస్యను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించారని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ సంఘ నాయకులు వీరయ్య దొర, పెద్ద బాలరాజు, శ్యాంసుందర్, వీరబాబు తదితరు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ద

## మంప పిజిఆర్ఎస్ లో 30 ఫిర్యాదులు స్వీకరణ

మండల అభివృద్ధి అధికారి "జ డి వి ప్రసాద్ రావు"




**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 31:** అల్లూరి జిల్లా కలెక్టర్ టి. విషాంతి ఆదేశాల మేరకు మంప సచివాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 30 ఫిర్యాదులు అందాయని ఎంపీడీవో జీడివి ప్రసాద్ రావు తెలిపారు. వీటిలో రెవెన్యూ డిపార్ట్మెంట్ 19 ఇరిగేషన్ శాఖ 4, హౌసింగ్ 4, వివిజి రాంజీ 3 లో ప్రజలు నుండి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి టి శ్రీనివాసరావు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# విశాఖ ప్రజల సమస్యలపై సర్కార్‌కు చలనం ఏదీ?



ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కె.కె. రాజు ధ్వజం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31 :**ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని విశాఖపట్నం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు ఆరోపించారు. పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సోమవారం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన ఆయన, స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి జిల్లాలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.అనంతరం నిర్వహించిన మీడి యా సమావేశంలో కె.కె. రాజు మాట్లాడుతూ.. నగర ప్రజలు తాగునీరు, వైద్యం, కాలుష్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగంతో పాటు జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**తాగునీటి సమస్యను పరిష్కరించాలి**

విశాఖ నగరంలో గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కె.కె. రాజు అన్నారు. నగరంలోని అనేక కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్‌లో నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్ప డిందన్నారు.గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాని ప్రాంతాల్లో జీవీఎంసీ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీరు అం దించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో స్థానికులే చందాలు వేసుకుని ట్యాంకర్ల కోసం ఫోన్‌పే ద్వారా చెల్లించాల్సి వస్తోందని ఆరోపించారు.తాటిపూడి జలాశయం నుంచి నగరానికి వచ్చే పైపులైన్లు, రిజర్వాయర్లు, నీటి సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శిం చారు. నగరానికి నిరంతర, సురక్షితమైన తాగునీటి సరఫరా అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**కేజీహెచ్‌లో మందుల కొరతపై విచారణ చేయాలి**

కేజీహెచ్‌లో అవసరమైన మందులు, ఇంజెక్షన్లు అందుబా టులో లేకపోవడంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కె.కె. రాజు డిమాండ్ చేశారు. వైద్యులు, సర్జన్లు ఉన్నప్పటికీ మందులు అందుబాటులో లేవని కొంతమంది రోగులకు చెబుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తు న్నారని ఆరోపించారు. పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రే ప్రధాన ఆధారమని, కేజీహెచ్‌లో అవసరమైన మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్సిజన్, మందులు, ఇంజెక్షన్ల సరఫరాలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**పోర్టు కాలుష్యంపై ప్రజాప్రతినిధులు స్పందించాలి**

విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కాలుష్య నివారణ, ప్రజా సంక్షేమం కోసం పోర్టు నుంచి కేటాయించే సీఎస్ఆర్ నిధులను ప్లాంటేషన్, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర అవసరాలకు సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. గత 26 నెలల్లో పోర్టు పరిధిలో ప్రజల కోసం తగిన స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించారా అని ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు పోర్టు కాలుష్యంపై సమీక్ష నిర్వహించారా అని నిలదీశారు. కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని కోరారు.

**ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి**

కప్పరాడ సర్వే నంబర్ 13లో సుమారు మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని కె.కె. రాజు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్లు నిర్మించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశంపై గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆధారా లు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసు కోలేదని విమర్శించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభు త్వ భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు తక్షణ మే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణ లపై ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

**జీవో 296 ప్రకారం పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి**

జీవో నెం. 296 ప్రకారం పేదల ఇళ్లు, స్థలాలను క్రమబద్ధీకరి స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కె.కె. రాజు కోరారు. పలువురు ప్రజలు సంబంధిత మొత్తాలను చెల్లించి, రీ-కన్వేయన్స్ డీడ్స్ తదితర ప్రక్రియలను పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు పత్రాలు అందలేదని తెలిపారు. ప్రజలు చట్టబద్ధంగా చెల్లింపులు చేసిన తర్వాత కూడా పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడటం దారుణమన్నారు. జీవో 296కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను వెంటనే అందించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

**అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి**

అగనంపూడి ప్రాంతంలో ఇటీవల జరిగిన అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కె.కె. రాజు డిమాండ్ చేశారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నప్పటికీ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

నగరంలోని అనేక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయని పరిస్థితి ఉందని, నేరాల దర్యాప్తులో సీసీ కెమెరాల ఫుటేజ్ కీలకమని తెలిపారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందన్నారు.

**జీవీఎంసీ అధికారుల మార్పులతో అభివృద్ధికి ఆటంకం**

జీవీఎంసీలో తరచూ కమిషనర్లు మారడం వల్ల నగర సమస్యలపై అధికారులకు పూర్తి అవగాహన ఏర్పడటం లేదని కె.కె. రాజు అన్నారు. రోడ్ల విస్తరణలో భూములు కోల్పోయిన సామాన్య ప్రజలకు నిబంధనల ప్రకారం రావాల్సిన పరిహారం, టిడీఆర్ తదితర ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి పారదర్శక పాలన అందించాలని డిమాండ్ చేశారు.

**గురుకుల విద్యార్థుల సమస్యలపై చర్యలు తీసుకోవాలి**

గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులను అర్ధరాత్రి సమ యంలో భయభ్రాంతులకు గురిచేసి ఖాళీ చేయించడం, తల్లి దండ్రులకు సరైన సమాచారం ఇవ్వకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ ఘటనపై ప్రజా, విద్యార్థి సంఘాలు, పా ర్టీ నాయకులు ఇప్పటికే ఆందోళనలు చేపట్టారని తెలిపారు.

గిరిజనుల నిరసనలను అడ్డుకోవడం, వారిని నిర్బంధించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కె.కె. రాజు పేర్కొన్నారు.

**ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలి**

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని కె.కె. రాజు అన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులు, సమస్యలకు అధికారులు రక్షణగా నిలవాలని సూచించారు. అధికార పార్టీ నాయకుల కింద పనిచేసే వారిగా కాకుండా ప్రజాసేవకులుగా అధికారులు వ్యవహరించాలని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమైతే ప్రజల తరఫున మరింత బలంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ నాయకులు కొట్టుమూరు సతీష్, బాణాల సత్య శ్రీనివాసరావు, పేడాడ రమణకుమారి సతీష్ వర్మ, సేనాపతి అప్పారావు, అనిల్ కుమార్ రాజు, అల్లు శంకర్రావు, కొండా రాజీవ్ గాంధీ, మంచా నాగమల్లేశ్వరి, పేర్ల విజయ్ చందర్, జీలకర్ర నాగేంద్ర, అంబటి శైలేష్, ఎం. సునీల్, శ్రీదేవి వర్మ, గొండబ మనోజ్, దేవరకుడా మార్కండేయులు, పిలా ప్రేమ్ కుమార్, శివరామకృష్ణ, సనపల రవీంద్ర భారత్, సంతోష్, నీల రవి, ఈశ్వరరావు, పరదేశి, ఈశ్వరి, చోల్లిగి నాగేశ్వర రావు, బొద్దేటి కిరణ్, బి.సెట్టి ప్రసాద్, ధర్మాల శ్రీనివాసరావు, బోగువెల్లి గోవింద్, గాలి ప్రసాద్, ప్రదీప్, మువ్వల సంతోష్, హరికృష్ణ, మహేష్, సూర్య, అనిల్ శర్మ, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఏఐజీ ఆసుపత్రికి శంకుస్థాపనలో మంత్రి నారా లోకేశ్

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం మంత్రి




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31 :**రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నాన్ని భవిష్యత్‌లో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆనందపు రం మండలం ఎండాడలో ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.విద్య, వైద్యం ప్రజల జీవితాల్లో అత్యంత కీలక మైనవని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో ఆశించే మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, కరోనా సమయంలో వైద్యులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించార ని కొనియాడారు. వైద్యుల సేవలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

పట్టుదలతో ప్రపంచస్థాయికి..

ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. చిన్నతనంలో అల్లరి పిల్లాడిగా ఉన్న నాగేశ్వర్‌రెడ్డి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చేరిన తర్వాత క్రమశిక్షణతో కూడిన వ్యక్తిగా మారారని చెప్పారు. అనంతరం కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించి, గ్యాస్ట్రోఎంటరాలజీ రంగంలోకి ప్రవేశించారని వివరించారు.పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రో ఎంటరాలజీ రంగంలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందారని ప్రశంసించారు. నాగేశ్వర్‌రెడ్డికి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు లభించినా ఆయన చేసిన సేవలకు అవి తక్కువేనన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం

ఏఐజీ హాస్పిటల్స్ కేవలం మరో కార్పొరేట్ ఆసుపత్రి కాదని లోకేశ్ అన్నారు. సాంకేతికతతో పాటు వైద్య పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ, నిరుపేదలకు సైతం నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏఐజీకి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

విశాఖలో రూ.2 వేల కోట్ల పెట్టుబడితో వెయ్యి పడకల సామర్థ్యంతో ఏఐజీ హాస్పిటల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేర్, ట్రైనింగ్, రీసెర్చ్‌తో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రోజుకు 5 వేల మంది రోగులకు సేవలందించే సామర్థ్యంతో ఔట్‌పేషెంట్ బ్లాక్, 50కి పైగా స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9 వేల మందికి ఉపాధి లభించనుందని, వెయ్యి మంది వైద్యులు సేవలందించనున్నారని తెలిపారు.

మూడు పద్మ అవార్డులు పొందిన వైద్యుడు

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అపారమైన పరిజ్ఞానం, కమిట్‌మెంట్ ఉన్నాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను అనారోగ్యానికి గురైన సమయంలో నాగేశ్వర్‌రెడ్డి అందించిన వైద్య సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన సేవలకు మూడు పద్మ పురస్కారాలు లభించాయని తెలిపారు. వైద్య పరిశోధనలకు ఆయన అధిక ప్రాధాన్యం ఇస్తారని, విశాఖకు ఏఐజీ హాస్పిటల్స్ రావడం సంతోషకరమని అన్నారు.

విశాఖలో మెడికల్ హబ్

ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖలో వైద్య రంగంలో చారిత్రక ప్రయాణానికి శ్రీకారం చుడుతున్నామని అన్నారు. విశాఖ కేజీహెచ్‌లోనే తాను జన్మించానని, తన బాల్యంలో తొలి ఆరేళ్లు ఈ నగరంలోనే గడిచాయని గుర్తుచేసుకున్నారు. విశాఖతో తనకున్న అనుబంధం కారణంగానే ఇక్కడ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలనే కోరిక కలిగిందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఆ కల సాకారమైందని తెలిపారు. ఏఐజీ హైదరాబాద్ ప్రపంచస్థాయి ఆసుపత్రుల్లో ఒకటిగా ఎదిగిందని, ప్రముఖ అంతర్జాతీయ సంస్థల గుర్తింపు పొందిందని చెప్పారు.

విశాఖలో సాధారణ కార్పొరేట్ ఆసుపత్రిని నిర్మించడం లేదని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. రోగులకు చికిత్స ఖర్చు భారంగా మారకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్య సేవలతో పాటు పరిశోధనలు, వైద్యులు, టెక్నీషియన్లు, నర్సులకు శిక్షణ ఇచ్చే కేంద్రంగా దీనిని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

దేశంలోని ఇతర నగరాలకు వైద్య చికిత్స కోసం వెళ్లే పరిస్థి తిని మార్చి, భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా ప్రజలు విశాఖకు వచ్చేలా నగరాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# బంగారుమెట్ట పిజిఆర్ఎస్ లో 74 ఆర్జీలు - ఎంపీడీవో

ఆర్జీ దారుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 31.**మండలంలోనీ బంగారుమెట్ట పంచాయతీలో నిర్వహించిన పిజిఆర్ ఎస్ లో ప్రజల నుండి 74 అర్జీలు వచ్చినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు తెలిపారు. సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ లో విద్యుత్ శాఖకు సంబంధించి 12, రెవిన్యూ శాఖకు 7, ఆర్డబ్ల్యూఎస్ 5, హౌసింగ్ 14, విద్యాశాఖ 2 తో పాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 74 అర్జీలు ప్రజల నుండి వచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, మండల ప్రజలు పిజిఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

* రైల్వే సిబ్బందికి భద్రతా అవార్డులు అందజేసిన డీఆర్ఎం లలిత్ బోహ్రా



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ ఆగస్టు 31:** విధి నిర్వహణలో అప్రమత్తత, సమయస్ఫూర్తి ప్రదర్శించి సంభవించే రైలు ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించిన రైల్వే సిబ్బందికి విశాఖపట్నం డివిజన్ డీఆర్ఎం లలిత్ బోహ్రా భద్రతా అవార్డులను అందజేశారు.రైల్వే కార్యక లాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, సిబ్బంది అప్రమత్తత, సమయస్ఫూర్తి, భద్రతా నిబంధనల పట్ల నిబద్ధత ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని డీఆర్ఎం అన్నారు.

పక్క రైలులో లోపాన్ని గుర్తించిన వేణుగోపాల్‌రావు

సీనియర్ రైలు నిర్వాహకుడు ఎం. వేణుగోపాల్‌రావు మే 31న 18529 ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తుండగా, పీవీపీ స్టేషన్ మీదుగా రైలు వెళ్తున్న సమయంలో పక్కనున్న రైలులో ని ఐదో బోగీకి చెందిన చక్రభాగం స్థానభ్రంశం చెందడాన్ని గు ర్తించారు. వెంటనే దృశ్యాలను చిత్రీకరించి సంబంధిత అధికా రులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సకాలంలో తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టారు.

లోకోలో విరిగిన స్ప్రింగ్ గుర్తింపు

సీనియర్ సహాయ లోకో పైలట్ కుడిపూడి సతీష్ జూన్ 3న షంటింగ్ విధుల్లో ఉండగా, 41397 నంబరు లోకోలో 12వ చక్రం వద్ద ప్రాథమిక సస్పెన్షన్‌కు సంబంధించిన బయటి వలయాకార స్ప్రింగ్ విరిగిపోయినట్లు గుర్తించారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఆ లోకోను ప్రయాణికుల రైలు సేవలకు కేటాయించిన నేపథ్యంలో ఆయన అప్రమత్తతతో ప్రమాదం తప్పింది.

వేడెక్కిన రైలు చక్రభాగాన్ని గుర్తింపు

సహాయకులు ఎన్. ఉమామహేశ్వరరావు, కె. ధనలక్ష్మి జూన్ 18న పీఎస్ఏ స్టేషన్‌లో రైలు నంబరు ఎన్/టీపీఏకే-255 రైలు పరిశీలన నిర్వహిస్తుండగా, లోకో నుంచి 20వ బోగీలోని నాలుగో చక్రానికి సంబంధించిన ఇరుసు భాగం అధికంగా వేడెక్కినట్లు గుర్తించారు. ప్రత్యేక ఉష్ణోగ్రత కొలిచే పరికరంతో పరిశీలించగా ఉష్ణోగ్రత 123.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వెంటనే సంబంధిత బోగీని రైలు నుంచి వేరు చేసి పక్క పట్టాపై ఉంచారు. దీంతో సంభవించే ప్రమాదాన్ని నివారించారు.

అప్రమత్తతే భద్రతకు కీలకం

అవార్డు గ్రహీతలను డీఆర్ఎం లలిత్ బోహ్రా అభినందించారు. ప్రతి రైల్వే ఉద్యోగి ఇదే విధమైన అప్రమత్తత, సమయస్ఫూ ర్తితో విధులు నిర్వహించాలని సూచించారు. చిన్న లోపాన్ని సైతం నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి వెంటనే ఉన్నతాధికారు లకు సమాచారం అందించడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.




## గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

* మహిళల భద్రత, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం.
* ముంచంగిపుట్టు ఎస్సై పీ నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 31.** గంజాయి మదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మహిళల భద్రత, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని తెలిపారు. సోమవారం మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ తుస్సపల్లి గ్రామంలో స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి గ్రామస్తులకు సమావేశము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మహిళల భద్రత, బాల్యవివాహాల నిరోధక చట్టాలు, గంజాయి వాడకం వల్ల కలిగి నష్టాలు రహదారి భద్రత నియమాలు, సైబర్ నేరల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత వాహనాలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు దుష్ప్రభాలపై యువతకు వివరించి చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీసు అధికారి సన్యాసిరావు దంపతులకు చట్టు మోహన్ ఘన సన్మానం

* సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపిన ఆదివాసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు



**అరకు లోయ పెన్ పవర్ ఆగస్టు 31 :** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకువేలి మండలం చినలబుడు గ్రామానికి చెందిన కొర్ర సన్యాసిరావు దంపతులను ఆదివాసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చట్టు మోహన్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో సన్యాసిరావు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఆయన చూపిన అంకితభావం, నిబద్ధతను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన దంపతుల జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి తమ అనుభవాలను అందిస్తూ మరింత సేవ చేయడానికి ఇది ఒక కొత్త అవకాశమని చట్టు మోహన్ పేర్కొన్నారు. సన్యాసిరావు వంటి గిరిజన ప్రాంతాలకు చెందిన అధికారులు అందించిన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ భాక గౌరీశ్వరరావు, వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి మొశ్య రంజిత్ కుమార్, శెట్టి బాలు తదితరులు పాల్గొని సన్యాసిరావు దంపతులకు అభినందనలు తెలిపారు.

## జీవీఎంసీ జోన్-2లో కనీస సౌకర్యాల కరువు



* కారిడార్లలోనే ప్రజల పడిగాపులు
* కూర్చోవడానికి కుర్చీ లేదు.. తాగడానికి నీరు లేదు ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తున్న దుస్థితి

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఆగస్టు 31:** గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-2 కార్యాలయంలో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్నులు, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే ప్రజలకు కూర్చునేందుకు కనీస సౌకర్యాలు కూడా లేవు. వార్డు నెంబర్ 7 నుండి 18 వరకు పరిధి గల ఈ జోనల్ కార్యాలయం మూడు అంతస్తుల భవనంలో ఉన్నప్పటికీ,వెయిటింగ్ హాల్, కుర్చీలు, తాగునీటి వసతి లేకపోవడంతో ప్రజలు కారిడార్లలోనే గోడలకు ఆనుకుని నిలబడాల్సిన దుస్థితి నెలకొంది.గంటల తరబడి నిలబడి ఎదురుచూడడం కనిపిస్తోంది.

జోనల్ కమిషనర్ ఛాంబర్ లో తప్ప మిగిలిన అడ్మినిస్ట్రేటివ్ తదితర సెక్షన్లలో ప్రజలు కూర్చునేందుకు ఒక్క కుర్చీ కూడా ఏర్పాటు చేయలేదు. పనిపై వచ్చిన వారిని 'బయట వెయిట్ చేయండి' అంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు కనీస వసతులు కల్పించడంలో విఫలమవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ స్పందించి జోన్-2 కార్యాలయంలో ప్రతి అంతస్తులో తాగునీరు, కూర్చునేందుకు బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

## ఎంపీటీసీ వ్యవస్థను రద్దు చేయాలి...

* ఐదేళ్లుగా నిధులు లేక.. గౌరవం లేక.. ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి......
* ఆఖరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీల ఆవేదన......



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 31):** గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన ఎంపీటీసీ వ్యవస్థకు నిధులు,అధికారాలు లేకపోవడంతో తమ పదవులు నామమాత్రంగా మారిపోయాయని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపీటీసీ వ్యవస్థను కొనసాగించడం కంటే ఎంపీపీని ప్రజలు నేరుగా ఎన్నుకునే విధానం తీసుకురావడం మంచిదని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు.సోమవారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన నాతవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డి.ఎర్రవరం ఎంపీటీసీ సభ్యురాలు ఇనప సప్పల పుష్ప మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఎంపీటీసీలుగా ఎన్నికైనప్పటికీ, ఐదేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి తమకు ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను కలవాలంటేనే ఇబ్బందిగా, సిగ్గుగా అనిపించే పరిస్థితి ఏర్పడిందన్నారు.మండల పరిషత్ సమావేశాలకు ఎంపీటీసీలు క్రమం తప్పకుండా హాజరవుతున్నప్పటికీ, తమ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేకపోతోందని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ప్రోటోకాల్ ప్రకారం ఎంపీటీసీలను ఆహ్వానించడం లేదని, దీంతో తమకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ రజాక్ మాట్లాడుతూ.. ఎంపీటీసీలకు కొన్ని నెలలుగా గౌరవ వేతనం కూడా అందడం లేదని తెలిపారు. మండల పరిషత్ సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజా సమస్యలపై సమాధానాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులకు వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారుల సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఐసీడీఎస్ పీఓ గౌరీ మాట్లాడుతూ.. బుచ్చంపేట తదితర గ్రామాల్లో అంగన్వాడీ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మిషన్ వాత్సల్యకు సంబంధించిన నిధులు మంజూరైన వెంటనే అర్హులైన పిల్లలకు అందజేస్తామని వెల్లడించారు.హౌసింగ్ ఏఈ జోగారావు మాట్లాడుతూ.. నాతవరం మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 650 ఇళ్లకు సంబంధించి త్వరలో మంజూరులు చేపడతామని తెలిపారు.అనంతరం ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసి దేవుడు, వైస్ ఎంపీపీ-2 మైనం గోపి, మండల అభివృద్ధి అధికారి ఎం. సత్య శ్రీనివాస్, ఏవో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## దోమలపై దండయాత్రకు "సీజనల్ సేన" సిద్ధం!

జీవీఎంసీ కీలక నిర్ణయం - 431 మంది మలేరియా సిబ్బంది నియామకం

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఆగస్టు 31:** విశాఖలో డెంగ్యూ, మలేరియా నియంత్రణకు జీవీఎంసీ మెగా ప్లాన్

నగరంలో దోమల బెడదను అరికట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) దోమలపై దండయాత్రకు సిద్ధమైంది.

నాలుగు నెలల కాలపరిమితికి కాంట్రాక్టు పద్ధతిలో 431 మంది మలేరియా సిబ్బందిని నియమించినట్లు జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి తెలియజేశారు.

నియమించిన సిబ్బంది సెప్టెంబర్ 1 నుండి డిసెంబర్ 31 వరకు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తారని,ఒక్కొక్కరికి నెలకు రూ.16,000 చొప్పున పారితోషికాన్ని కార్పొరేషన్ చెల్లించనుందని ఆయన పేర్కొన్నారు.



ఈ కాంట్రాక్టు సిబ్బంది అన్ని నియోజకవర్గాల వారీగా, అన్ని జోనల్ కార్యాలయాల పరిధిలో పనిచేయనున్నారని, వారి వివరాలను పై అధికారులకు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. నియమితులైన సిబ్బంది రేపటి నుండి అనగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి విధులకు హాజరు కానున్నారని సాంబమూర్తి వెల్లడించారు.

## నల్లగొండలో ఈనెల2న వైయస్సార్ వర్ధంతి

వైసిపి మండల పార్టీ అధ్యక్షులు బిడిజన పిలుపు



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 31:** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు నల్లగొండలో నిర్వహించనున్నట్లు వైసిపి పార్టీ మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వైయస్సార్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలోని నల్లగొండలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల వద్ద నివాళులు అర్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వైసీపీ నేతలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, మాజీసర్పంచులు, ఎంపీటీసీలు, అభిమానులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అప్పారావు కోరారు.ద

## డ్రైవర్ నిర్లక్ష్యానికి విద్యార్థి బలి.

* ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థి ప్రాణాలకు ముప్పు.
* డ్రైవర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి -ఎస్ఎఫ్ఐజిల్లా కార్యదర్శి బి.అనిల్ డిమాండ్.



**కురుపాం ఆగస్టు 31 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లా,కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థి బస్సు దిగుతుండగా ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును ముందుకు తీసుకెళ్లడం వల్ల తీవ్ర ప్రమాదం జరిగింది. మన్యం జిల్లా కార్యదర్శి భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ బిడ్డక పత్రికా విలేకరులతో అన్నారు.ఈ మేరకు అనిల్ మాట్లాడుతూ,విద్యార్థికి ఈ సంఘటన జరగడం బాధాకరమని విద్యార్థి ప్రాణాలు అతి కష్టం మీద బయటపడ్డాడు.ఇది ముమ్మాటికీ డ్రైవర్ నిర్లక్ష్యమేనని.ప్రతిరోజూ వందలాది మంది గిరిజన విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే పాఠశాలలకు వస్తున్నారు.డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.విద్యార్థులు దిగకముందే బస్సు కదపడం,స్టాపుల్లో ఆపకపోవడం పరిపాటిగా మారింది.కావున,నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ బస్సు డ్రైవర్ పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి.ఆర్టీసీ అధికారులు విద్యార్థుల భద్రతకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలి.బాధిత విద్యార్థికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి.ప్రత్యేకంగా విద్యార్థులకు కోసం బస్సు ఏర్పాటు చేయాలి.లేనిపక్షంలో డిపో ఎదుట ధర్నా చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకుడు మన్యం జిల్లా కార్యదర్శి బిడ్డకు అనిల్ హెచ్చరిస్తున్నాం.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి కళా సేవా పీఠం ఆర్థిక చేయూత

- గతంలో విద్యాభ్యాసానికి రూ.20 వేల సాయం
- ఇప్పుడు వివాహానికి మరో రూ.20 వేల ఆర్థిక సహాయం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 31** : పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక చేయూత అందిస్తున్న గోపాలపట్నం కళా సేవా పీఠం మరోసారి మానవతా దృక్పథాన్ని చాటుకుంది. పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచింది. గోపాలపట్నం పరిధిలోని నరసింహనగర్‌కు చెందిన దొడ్డి భావన రేడియోలు, టీవీలు మరమ్మతు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అయితే సుమారు నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. దీంతో ఆయన భార్య, కుమార్తె గాయత్రి కుటుంబానికి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. కుటుంబానికి ప్రధాన ఆధారమైన భావన మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన గోపాలపట్నం కళా సేవా పీఠం గతంలో భావన కుమార్తె గాయత్రి ఇంటర్ విద్యాభ్యాసానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించింది. విద్యను కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా పీఠం సభ్యులు అండగా నిలిచారు. ప్రస్తుతం గాయత్రికి వివాహం నిశ్చయమవడంతో ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న కళా సేవా పీఠం మరోసారి ముందుకు వచ్చింది. గాయత్రి వివాహ ఖర్చులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. పేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి తమ వంతు సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా కళా సేవా పీఠం సభ్యులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద కుటుంబంలోని ఆడబిడ్డ వివాహం ఆగిపోకూడదనే ఉద్దేశంతో తమకు సాధ్యమైన మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గాయత్రి కుటుంబానికి గతంలో విద్యాభ్యాస సమయంలో సహాయం అందించి, ఇప్పుడు వివాహ సమయంలో కూడా అండగా నిలవడం పట్ల స్థానికులు కళా సేవా పీఠం సభ్యులను అభినందించారు. పేద కుటుంబాలకు విద్య, వైద్యం, వివాహం వంటి అవసరాల సమయంలో సహాయం అందించడం ద్వారా కళా సేవా పీఠం చేస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. ఈ సేవా కార్యక్రమానికి నందవరపు సోములు, చందు సుబ్బారావు, గోరకల రామదాసు, గొరపల్లి బంగార్రాజు, బొడ్డేటి చలపతిరావు, తాండ్రంగి రామారావు, పి. జాకబ్ రాజు, కొప్పిశెట్టి వెంకట్, కలగ చిన్నమ్మలు, శరగడం మోహన్ కృష్ణ, పెదిరెడ్ల ప్రసాద్, ఎం. అప్పలనాయుడు, ఎం.ఎన్.వి. శ్రీనివాస్, కేత నాగలక్ష్మి, దుర్గ మల్లేశ్వర ప్రసాద్, డబ్బేరు ప్రమీల కుమారి, వానపల్లి విజయలక్ష్మి, ఎం. సూర్యప్రభ, కే. ప్రదీప్ కుమార్, కొంతం నూక రాజేశ్వరరావు, శరగడం శ్రీనివాసరావు, అనపర్తి అప్పారావు, కొమ్మాది వెంకట్రావు, ఎల్లపు రమణ రావు, ముదునూరి కృష్ణవేణి, ఎన్.వి. నరసింహం, ఆర్. సాంబశివరావు, ముదపాక శివ, కంపర కనకరాజు, గోరంట్ల సింహాచలం, అడవిపల్లి శోభారాణి, పోతుల సత్యవేణి తదితరులు తమ సహాయ సహకారాలు అందించారు. పేదింటి ఆడబిడ్డకు విద్యాభ్యాసం నుంచి వివాహం వరకు రెండు దశల్లో రూ.40 వేల ఆర్థిక సహాయం అందించడం ద్వారా కళా సేవా పీఠం సామాజిక సేవకు మరో ఉదాహరణగా నిలిచింది.

# దివ్యాంగుల స్వావలంబనకు ప్రభుత్వం అండ ఎమ్మెల్యే గణబాబు





## ఉచిత మోటరైజ్డ్ మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 31** : దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు అన్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో, స్వావలంబనతో జీవించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గోపాలపట్నంలోని విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన శారీరక దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల మోటరైజ్డ్ స్కూటర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు లబ్ధిదారులకు వాహనాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా, స్వతంత్రంగా జీవించేందుకు అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తోందన్నారు. ముఖ్యంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనే దివ్యాంగులకు మోటరైజ్డ్ మూడు చక్రాల స్కూటర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వీటి ద్వారా వారు తమ వ్యక్తిగత అవసరాలతో పాటు ఉపాధి, విద్య, ఇతర సామాజిక కార్యకలాపాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగులలో ప్రతిభకు కొదవ లేదని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో రాణించగలరని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. దివ్యాంగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు దివ్యాంగులకు ఉచితంగా మోటరైజ్డ్ మూడు చక్రాల స్కూటర్లు అందజేశారు. పాలకొండ రమణమ్మ, పొలక జయభారతి, జనపరెడ్డి జానకి అనురాధ, అనకాపల్లి రాంబాబు, పొడుగు సాయి తేజేష్, కంపర చక్రవర్తి వాహనాలు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ రోజువారీ ప్రయాణాలకు, వ్యక్తిగత అవసరాలకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పీజీఆర్ఎస్

## మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 31** : ప్రజల సమస్యలను సులభంగా, పారదర్శకంగా, నిర్ణీత గడు వులోగా పరిష్కరించేందుకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు.ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే లా కార్యాలయాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.స్వీకరించిన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించడంతో పాటు సమస్య పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ప్రజలకు చేరువగా పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సంతృప్తి సాధించేలా పనిచేయాలని ఆదేశించారు.

## సర్టిఫికెట్లు పోగొట్టుకున్న విద్యార్థిని - స్టేషన్లో ఫిర్యాదు

- వనగం జ్యోతిక పదవ తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు ముంచంగిపుట్టులో పొయ్యాయి.
- ఎవరికైనా దొరికితే విధిగా అందజేయాలని విజ్ఞప్తి చేసిన గిరిజన సంఘం నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 31.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద బస్సు సెల్టర్ లో వనగం జ్యోతిక అనే డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థినికు సంబంధించి బ్యాగ్ లో ఉన్న పదవతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమొలు బ్యాగ్ తో పాటు పోయినట్లు ఆదివాసి గిరిజన సంఘం నేతలు ఎమ్ఎమ్ శ్రీను నరసయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం మాట్లాడుతూ.. మారుమూల బూసిపుట్టు పంచాయతీ, తోటలమెట్ట గ్రామానికి చెందిన చంద్రుబాబు కుమార్తె వనగం జ్యోతిక పాడేరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతుందన్నారు. సోమవారం ఉదయం ఆమె మండల కేంద్రంలో గల బస్సు సెల్టర్ లో బస్సు ఎక్కెందుకు వచ్చి బ్యాగు పోగొట్టుకుందని, ఆ బ్యాగులో పదోతరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ లు ఉందన్నారు. అది ఎవరికైనా దొరికితే ఫోన్ నంబర్ 8328065879 ద్వారా సంప్రదించి సర్టిఫికెట్లు అందజేయలని, లేకుంటే స్థానిక పోలీస్ స్టేషన్లో అందించాలని వారు కోరారు. ఈవిషయం పై బాధితురాలు జ్యోతికతో వెళ్ళి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

## అధిక మోతాదుపై అవగాహనతోనే ప్రాణాలను కాపాడగలం

**నరవలో అంతర్జాతీయ అధిక మోతాదు అవగాహన దినోత్సవం**




**పెందుర్తి, పెన్ పవర్, ఆగస్టు 31** : మత్తు పదార్థాలు, డ్రగ్స్‌ను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నరవ బెహరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ అధిక మోతాదు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నరవ బెహరా నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు ప్రజలకు డ్రగ్స్, మత్తు పదార్థాలు, మత్తు పానీయాలను అధిక మోతాదులో వినియోగించడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబానికి, సమాజానికి కూడా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపల్ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 31న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ అధిక మోతాదు అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్ అధిక మోతాదు కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడంతో పాటు, అధిక మోతాదు ప్రభావం నుంచి ప్రాణాలతో బయటపడిన వారికి, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలవడం, మద్దతు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. "డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ఒక్కరి బాధ్యత కాదు.. ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి పౌరుడి బాధ్యత. యువతకు సరైన అవగాహన కల్పిస్తే మత్తు పదార్థాల బారిన పడకుండా వారిని కాపాడవచ్చు" అని ఆమె అన్నారు. అధిక మోతాదు కారణంగా సంభవించే ప్రాణనష్టం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ వాసవి, నర్సింగ్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు స్థానికులకు అవగాహన కల్పిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

## రహదారిలో గుంతలు పూడ్చిన కనకదుర్గ ఆటో యూనియన్ నాయకులు

**వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 31.** ముంచంగిపుట్టు మండల కేంద్రం నుండి కుమడ వెళ్లే రోడ్డు మార్గంలో జూనియర్ కాలేజ్ పక్కన ప్రధాన రహదారి వద్ద ఏర్పడ్డ భారీ గుంతలను కనకదుర్గ ఆటో యూనియన్ నాయకులు తమ సొంత నిధులతో కంకర, డస్ట్ మెటీరియల్స్ తెచ్చి శ్రమదానంతో పూడ్చినట్లు వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అయన మాట్లాడుతూ.. భారీ టిప్పర్లు బరువు కలిగిన బళ్ళులు ఈ రహదారి గుండా తిరగడం వల్ల భారీ గోతులు ఏర్పడ్డాయనీ దీంతో బళ్ళు తిరగడానికి తీవ్ర అంతరాయం ఏర్పడి వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులను గమనించిన కనకదుర్గ ఆటో యూనియన్ నాయకులు తమ సొంత నిధులతో ఆ గోతులను పూడ్చరని అన్నారు. కాగా రహదారుల్లో ఎక్కడైతే గోతులు ఏర్పడి ఉన్నాయో అక్కడ ప్రభుత్వ అధికారులు స్పందించి గోతులను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాల భారీ నుండి కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సేవా భావంతో ఆటో యూనియన్ నాయకులు చేపట్టిన పనులకు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, ఆటో యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com